# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు.
- అసెంబ్లీ భవనం, ఇతర ప్రభుత్వ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు.
- రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.
- దేశ న్యాయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నూతన న్యాయ చట్టాలు దోహదపడతాయని విజయవాడ నగర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అది రాజ్ సింగ్ రాణా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. దీనిలో భాగంగా ఈ రోజు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసిన ఆయన రాష్ట్ర ఆర్థిక అవసరాలపై మెమోరాండాన్ని ఆమెకు అందజేశారు. పలు ప్రాజెక్టులకు ఆర్థికసాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. పోలవరం, అమరావతితో పాటు వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఆర్థిక భరోసా అందిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి తగిన చేయూత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎన్డీయే ఎంపీలు పాల్గొన్నారు. అలాగే కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డాతో కూడా ముఖ్యమంత్రి భేటీ అయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

శాసన, శాసన మండలి సభ్యుల క్వార్టర్ల భవనాలను 9 నెలల కాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సిఆర్డిఏ (CRDA) అధికారులను కోరారు. ఈ రోజు అసెంబ్లీ కమిటీ హాల్లో సిఆర్డిఏ, అసెంబ్లీ అధికారులతో

ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అసెంబ్లీ భవనం, ఇతర భవనా నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మీడియా పాయింట్ ఉన్న ఎనెక్స్ భవనాన్ని మెరుగుపరచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

(వాయిస్ 37 సెకన్లు) Net

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈరోజు తిరుపతిలో పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తిరుపతి, అన్నమయ్య జిల్లాలో ఉన్న ప్రధాన పర్యాటక ప్రాంతాలైన హార్సిలీహిల్స్, తలకోన వంటి ప్రదేశాలలో పర్యాటకులకు తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతిలోని జూ పార్క్ రోడ్డులో అధునాతన పర్యాటకశాఖ కార్యాలయం నిర్మితమవుతోందని.. అలాగే భక్తులకు ప్రత్యేకంగా వసతి గృహాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ న్యాయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నూతన న్యాయ చట్టాలు దోహదపడతాయని విజయవాడ నగర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అది రాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ రోజు విజయవాడలో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో పార్ట్ టైం కరస్పాండెంట్ (పిటిసి)లకు, సిబ్బందికి నూతన నేర చట్టాలపై ఒక రోజు వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డిసిపి మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడేలా నూతన చట్టాల్లో సాంకేతికతకు పెద్దపీట వేశామని తెలిపారు. ఈ చట్టాల్లో ప్రధానంగా ఎఫ్ఐఆర్, జ్యూరిస్ డిక్షన్ పరిధిని విస్తృతం చేశారని, అలాగే ఈ - ఎఫ్.ఐ.ఆర్.ను మొబైల్ ద్వారా నమోదు చేయవచ్చని తెలిపారు. బాధితులకు 90 రోజుల్లో చర్యలు తీసుకునేలా నూతన చట్టాలు దోహదపడతాయని అన్నారు. ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సోమేశ్వరరావు మాట్లాడుతూ, ఆకాశవాణి సిబ్బందికి నూతన నేర చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యశాల నిర్వహించామని తెలిపారు. అనంతరం నూతన నేర చట్టాలపై పిఐబి రూపొందించిన సంక్షిప్త సమాచార ప్రత్యేక సంచికను ఆకాశవాణి విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం సోమేశ్వరరావు, ఆకాశవాణి విజయవాడ, విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీ సాయి వేంపాటి న్యూస్ ఎడిటర్ కలిసి విడుదల చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వాటిని అమలు చేయడం ద్వారా స్వదేశీ రక్షణ ఉత్పత్తుల వృద్ధి మునుపెన్నడూ లేనంతగా రికార్డు స్థాయికి చేరినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2023-24లో 16.7 శాతం వృద్ధి రేటు సాధించిందని, రక్షణ రంగ ఉత్పత్తుల విలువ లక్షా 26 వేల 887 కోట్ల రూపాయలకు చేరినట్టు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు తెలిపారు. భారత్ ను అంతర్జాతీయ స్థాయిలో డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ ను ముందుకు నడిపే విధంగా తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా డెల్టా ఆయకట్టుకు సాగునీరివ్వడం ఆగస్టు వరకు సాధ్యం కాదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో ఈరోజు నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రణాళికతో ముందుకెళ్తామని, పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని మంత్రి తెలియజేశారు.

==========================

పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను పూర్తిగా అరికట్టాలని, వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. పని చేసే ప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టం-2013 అమలుపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు, సిబ్బందికి కలెక్టరేట్ లో ఈ రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో ఈ చట్టంపై అవగాహన కల్పించినప్పుడే, ఇది పూర్తిస్థాయిలో అమలవుతుందని అన్నారు. దీని కోసం అధికార యంత్రాంగం కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

==========================

రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలు.. నగరపాలక సంస్థలలో టి.డి.ఆర్. బాండ్లకు సంబంధించి పలు అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తామని రాష్ట్ర పురపాలక.. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈరోజు నెల్లూరులో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డితో సమావేశమైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వై.ఎస్.ఆర్.కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోని లే-ఔట్లలో అవకతవకలు జరిగాయనే అంశంపై విచారణ జరుపుతున్నామని అన్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణం కారణంగా రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగముతో బలమైన గాలులు వీచే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

నీట్-పీజీ ప్రవేశ పరీక్షపై నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఈ రోజు కీలక ప్రకటన చేసింది. వాయిదా పడ్డ నీట్-పీజీ ప్రవేశ పరీక్షను ఆగస్టు 11వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇతర వివరాల్ని ఆగస్టు 15న వెల్లడిస్తామని పేర్కొంది.

==========================

అధికారులు అంకిత భావంతో పని చేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ఈ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి.ఆర్. రాధిక, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ లతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి అందించే దిశగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సిబ్బంది అప్రమత్తతతో పని చేయించాలని, అన్ని శాఖలు సమన్వయంతోనే మంచి ఫలితాలు సాధించగలమని అన్నారు.

==========================

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని సంవత్సరంలో నాలుగుసార్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా మంగళవారం నాడు నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేస్తునట్లు వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బాపట్ల జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జె.వెంకట మురళిని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈక్రమంలో ఇరు జిల్లాలోని పరిపాలన పరమైన అంశాలు, శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =